క్లుప్తంగా

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు


హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో మంగళవారం తహసీల్దార్ సుబ్రమణ్యం ఆదేశాల మేరకు ఆర్ఐ నల్లయ్య, వీఆర్వో బాలమురళి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనమనంబేడు రెవెన్యూలోని సర్వే నంబర్ 352లోని భూమిని ప్రభుత్వ భవనాలు, ప్రజా ప్రయోజనార్థం కేటాయించినట్లు తెలిపారు. ఈ భూమి ఆక్రమంగా ఆక్రమిస్తే చట్టరీత్యా శిక్షార్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో జగదీష్, వీఆర్ఏలు అనిల్, సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి పైపులకు మరమ్మతు


పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ సుశీల

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ అన్నాస్వామిపల్లెలోని తాగునీటి బోరు నుంచి ఓవర్ ట్యాంక్‌కు వెళ్లే పైపులు లీకేజీ ఉండడంతో మంగళవారం పంచాయతీ కార్యదర్శి హరి ఆధ్వర్యంలో పైపులకు మరమ్మతు పనులు చేశారు. సర్పంచ్ సుశీల పనులను పర్యవేక్షించారు. వేసవి సమీపిస్తుండడంతో పంచాయతీలోని తాగునీటి బోర్లు, ట్యాంకులు వద్ద ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


శుకబ్రహ్మాశ్రమంలో యోగా చేస్తున్న అభ్యసకులు

శ్రీకాళహస్తి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా గురువు మార్కండేయులు అన్నారు. పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో మంగళవారం రథసప్తమిని పురస్కరించుకుని అభ్యసకులతో సూర్యనమస్కారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా సాధకులు భాస్కర్, గరికపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుపై అప్రమత్తంగా ఉందాం

శ్రీకాళహస్తి: గుండెపోటుపై అప్రమత్తంగా ఉండాలని శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం గుండెపోటు లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చాతినొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మికంగా ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటివి గుండెపోటు లక్షణాలన్నారు. గుండెపోటు వచ్చిన మొదటి గంటలోనే 198 ఫోన్ చేస్తే వారు సమీపంలోని సామాజిక ఆరోగ్యకేంద్రానికి లేదా ప్రభుత్వాస్పత్రికి తీసుకెళతారన్నారు. వైద్యులు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి మొదటి గంటలోనే రూ.45 వేలు విలువ చేసే టెనెక్టెప్లెస్ ఇంజెక్షన్ ఉచితంగా అందించి ప్రాణాలు కాపాడుతారని ఆమె తెలిపారు. అన్ని ప్రభుత్వాస్పత్రులు, ఎన్టీఆర్ ఆరోగ్యసేవ ద్వారా గుర్తింపు పొందిన ప్రైవేటు ఆస్పత్రుల్లో అంజియోప్లాస్టీ, బైపాస్ సర్జరీ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గుండెపోటు వచ్చినపుడు మొదటి గంట చాలా కీలకమైందని ప్రాణాలు కాపాడుకోవడానికి గుండెపోటు బాధితులు ఈ వైద్యసేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సులో ఆర్ఎంవో మధు తదితరులు పాల్గొన్నారు.

60 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం


రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న టాటాఏస్, రేషన్ బియ్యం

శ్రీకాళహస్తి: పట్టణంలోని బైపాస్ సమీపంలో టాటాఏస్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 60 బస్తాల రేషన్ బియ్యాన్ని మంగళవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రహస్య సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు పలు ప్రాంతాల్లో నిఘా పెట్టి, తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో బైపాస్ సమీపంలో వస్తున్న టాటా ఏస్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో 60 బస్తాల రేషన్ బియ్యం ఉండగా గుర్తించి, వాహనం సహా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాహనాన్ని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

గ్రామాల్లో మద్యాసురుడు మాటేశాడు.. రేయింబవళ్లు మద్యం అందుబాటులోకి వచ్చింది. ఊరూర వెలిసిన బెల్టుషాపులు అమాయకుల బతుకులను తాకట్టు పెట్టేలా చేస్తున్నాయి. ఏ పల్లె చూసినా.. ఏముంది గర్వకారణం.. నిత్యం మత్తులో జోగే జనం తప్ప అన్న రీతిలో సురాపానం విక్రయాలు సాగుతున్నాయి. ఫలితంగా పచ్చని కాపురాల్లో చిచ్చు రేగుతోంది. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం మాయమవుతోంది. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ మామూళ్ల మత్తులో జోగుతోంది. మద్యం దుకాణాలు, బెల్టుషాపుల నిర్వాహకులు మందుబాబులను కొల్లగొడుతున్నారు. ఇదీ కూటమి కొత్త మద్యం పాలసీతో పల్లె జనం పడుతున్న ఇబ్బంది.

వరదయ్యపాళెం మండలం కారిపాకంలో ఓ చిల్లర దుకాణం వద్ద మద్యం విక్రయం





బెల్టు పెట్టు.. కొల్లగొట్టు..!

- క్వార్టర్‌కు రూ.50 అదనంగా వసూలు
- 24 గంటలూ అందుబాటులో మద్యం
- ఒక్కో గ్రామంలో 3 నుంచి 5 బెల్టు షాపులు
- అధికార పార్టీ నేతల కనుసన్నల్లో వ్యాపారం

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వ హయాంలో ఊరూరా బెల్టుషాపులు పుట్టగొడుగులా పుట్టుకొస్తున్నాయి. గ్రామానికి 3 నుంచి 5 బెల్టుషాపుల వరకు వెలిశాయి. 24 గంటలు మద్యం అందుబాటులో ఉంటుందని గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వాహకులు ప్రచారం చేసుకుంటున్నారంటే ఎంత బరితెగించారో అర్థం చేసుకోవచ్చు. క్వార్టర్‌కు రూ. 50 అదనంగా పిండేస్తూ మద్యాన్ని ఊరూరా పారిస్తూ పేదలను పీక్కు తింటున్నారు. నియంత్రించాల్సిన ఎక్సైజ్‌శాఖ, పోలీసులు కూటమి నేతల కనుసన్నల్లో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో సత్యవేడు నియోజకవర్గంలో బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలోని 7 మండలాల్లో 34 మద్యం దుకాణాలు అధికారికంగా ఉన్నాయి. వీటికి అనుబంధంగా అనధికారికంగా సుమారు 150 బెల్టు దుకాణాలు ఉన్నట్లు సమాచారం. దీంతో మద్యంబాబులకు కిక్కు ఎక్కువై పచ్చని కాపురాల్లో చిచ్చు రేగుతోంది.

క్వార్టర్‌పై రూ.30 నుంచి రూ.50వరకు అదనం

బెల్టు షాపుల్లో క్వార్టర్‌పై రూ.30 నుంచి రూ. 50 వరకు అదనంగా వసూలు చేస్తూ మద్యంబాబులను దోపిడీ చేస్తున్నారు. మద్యానికి బానిసైన వారు అదనపు రేట్లను లెక్క చేయకుండా కొనుగోలు చేస్తున్నారు. అంతేకాక మద్యంలో సైతం నాణ్యత లేదని వారు వాపోతున్నారు. ఎమ్మార్పీకే విక్రయిస్తామని ప్రగల్భాలు పలుకుతున్న కూటమి నేతల ప్రచారాల అసత్య ప్రచారాలుగా మారాయని మందుబాబులు వాపోతున్నారు.


కారిపాకంలో బెల్టు షాపు వద్ద మద్యం తాగుతున్న మందుబాబులు

మద్యం దుకాణాలు, బెల్టు షాపుల వివరాలు

మండలం	మద్యం దుకాణాల సంఖ్య	బెల్టుషాపుల సంఖ్య
నాగలాపురం	5	25
వరదయ్యపాళెం	5	40
పిచ్చాటూరు	3	17
నారాయణవనం	3	10
కేవీబీపురం	3	18
బీఎన్‌కండ్రిగ	5	13
సత్యవేడు	10	28
మొత్తం	34	151

మామూళ్ల మత్తులో ఎక్సైజ్‌శాఖ

గ్రామస్థాయిలో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు పుట్టుకొస్తున్నా నియంత్రించాల్సిన ఎక్సైజ్‌శాఖ పోలీసులు మామూళ్ల మత్తులో తూలుతున్నారు. ఒక్కో మద్యం దుకాణం నుంచి రూ.25 వేల నుంచి రూ. 30 వేలు మామూళ్లు ఎక్సైజ్‌శాఖ పోలీసులు అందుకుంటున్నారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 34 మద్యం దుకాణాల నుంచి నెలకు రూ.10 లక్షలు వరకు మామూళ్లు ఎక్సైజ్‌శాఖకు చెందిన కిందిస్థాయి అధికారుల నుంచి పైస్థాయి అధికారుల వరకు చేరుతున్నాయి. ఈ క్రమంలో నియోజకవర్గంలోని 7 మండలాల్లో 150కి పైగా బెల్టు దుకాణాలు ఉన్నట్లు సమాచారం.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యం



వరదయ్యపాళెం మండలంలో దాదాపు 40కి పైగా మద్యం బెల్టు దుకాణాలున్నాయి. ఈ విషయాన్ని అధికారులకు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఈ నెల 2వ తేదీన కారిపాకం గ్రామం నుంచి 10 మంది మహిళలు వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌లో బెల్టుషాపుల నియంత్రణ గురించి ఫిర్యాదు చేసినా పట్టించుకోదని ఆ గ్రామం మహిళలు వాపోతున్నారు. పోలీసులు దృష్టి సారిస్తే బెల్టుషాపులన్నీ మూతపడతాయి.

-చిన్నిరాజ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి

బెల్టుషాపులు అరికట్టాలి



నియోజకవర్గంలో విచ్చలవిడిగా మద్యం బెల్టు దుకాణాలు పుట్టుకొస్తున్నాయి. ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించడంలో పూర్తిగా విఫలమయ్యారు. అత్యధిక ధరలకు బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయిస్తుండడంతో కాయకష్టం చేసుకునే వారి జేబులకు చిల్లుపడుతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

-దాసరి జనార్దన్, సత్యవేడు నియోజకవర్గ సీపీఎం నాయకుడు

---

7 నుంచి రేణుకమ్మ ఉత్సవాలు

నారాయణవనం: స్థానిక పట్నాలు వీధిలోని రేణుకా పరమేశ్వరీ ఆలయ వార్షిక ఉత్సవాలను ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దానా పరశురామయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం అమ్మవారి జడ ఊరేగింపు, ఊంజల్‌సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం రేణుకమ్మ ఊరేగింపు, ఆదివారం సాయంత్రం పొంగళ్లు, మహానైవేద్యం, రాత్రి అమ్మవారి పసుపు ప్రతిమ నిమజ్జనం చేస్తామన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


డ్రైవర్లతో ప్రమాణం చేయిస్తున్న ఎంవీఐ దామోదరనాయుడు

రేణిగుంట: రహదారి భద్రత నియమాలను పాటించి, ప్రమాదాల నివారణకు కృషి చేయాలని శ్రీకాళహస్తి మోటార్ వెహికల్ తనిఖీ అధికారి దామోదర్ నాయుడు అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి సమీపంలోని కోకా-కోలా ప్లాంట్‌లో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే డ్రైవర్లు విధిగా రహదారి భద్రత నియమాలు పాటించాలన్నారు. ఉత్తమ డ్రైవర్లకు బహుమతులను అందజేశారు. డ్రైవర్లతో రహదారి నిబంధనలు పాటిస్తామని ప్రమాణం చేయించారు.

ఇన్‌చార్జ్ పదవికి ఓ వర్గం కుట్రలు

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో ఇన్‌చార్జ్ పదవి కోసం టీడీపీలోని ఓ వర్గం కుట్రలు చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి స్వార్థ రాజకీయాల కోసం తనతో పాటు తన కుటుంబ సభ్యులపై అనవసర నిందలు మోపుతూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. మంగళవారం నియోజకవర్గంలోని పిచ్చాటూరు మండల కేంద్రంలో 7 మండలాలకు చెందిన తన అనుచరులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ బాబు తనను ఆదరించి, ఎమ్మెల్యేను చేస్తే దాన్ని జీర్ణించుకోలేని నియోజకవర్గంలోని కొందరు టీడీపీ నేతలు నియోజకవర్గానికి సంబంధం లేని కొందరు నాయకులతో కలిసి తనపై కుట్రకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తాను దళిత ఎమ్మెల్యే కావడంతోనే ఇంతగా కుట్ర చేస్తున్నారన్నారు.

శ్మశాన దారి ఆక్రమణ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): గత ప్రభుత్వంలో శ్మశానానికి దారి లేదని గ్రామస్తులు కోరడంతో రైతులతో మాట్లాడి రెవెన్యూ రికార్డుల్లో ఉన్న దారి స్థలాన్ని చదును చేసి శ్మశానానికి దారి ఏర్పాటు చేస్తే, ప్రస్తుతం కూటమి నాయకుల అండదండలతో దారిని తవ్వేసి తన పొలంలో కలుపుకునేశారు. రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీలోని నీలసానిపేట గ్రామానికి ఏళ్ల తరబడి శ్మశానానికి దారి లేక పొలం గేనలపైన అంతిమ యాత్రలు కొనసాగిచ్చేవారు. గత ప్రభుత్వంలో 2023లో శ్మశానానికి దారి కావాలని గ్రామస్తులు కోరడంతో రెవెన్యూ రికార్డుల్లో ఉన్న ప్రకారం సర్వే చేయించి, పంచాయతీరాజ్ నిధులతో శ్మశానానికి దారి ఏర్పాటు చేశారు. ప్రస్తుతం స్థానిక కూటమి నాయకుల అండదండలతో దారికి పక్కనే ఉన్న రైతు దారిని తవ్వేసి తన పొలంలో కలుపుకున్నారు. కూటమి నాయకుల మద్దతు ఉండడంతో గ్రామస్తులు అడిగేందుకే భయపడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని శ్మశానానికి ఉన్న దారిని యథావిధిగా కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని రెండు రోజుల క్రితం జరిగిన మండల సర్వసభ సమావేశంలో సర్పంచ్ గంగారి రమేష్ మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం.


గత ప్రభుత్వంలో శ్మశానానికి వేసిన దారి, దారిని తవ్వి పొలంలోకి కలుపుకున్న దృశ్యం

ఆటో డ్రైవర్‌పై దాడి.. మృతి

సత్యవేడు: మండలంలోని ఓబులరాజుకండ్రిగ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎస్.లక్ష్మయ్యపై అదే గ్రామానికి చెందిన జగదీష్, భాస్కర్‌రాజు దాడి చేశారు. దీంతో గాయాల పాలై వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కథనం.. రెండు రోజుల క్రితం ఓబులరాజు కండ్రిగకు చెందిన జగదీష్, భాస్కర్‌రాజు పాండూరులో ఎరువుల సంచులు తీసుకుని ఓబులరాజుకండ్రిగ గ్రామానికి వెళ్లేందుకు ఆటో డ్రైవర్ లక్ష్మయ్యను పిలిచారు. సమీపంలో ప్రయాణికులను దించి వస్తానని చెప్పి వెళ్లాడు. ఆటో డ్రైవర్ తిరిగి వచ్చే సరికి వీరు కనిపించలేదు. కొంతదూరం పోవడంతో దారిలో మరో ఆటోలో యూరియా వేసుకుని వెళుతున్నట్లు వారిని గుర్తించాడు. బాడుగ కుదుర్చుకుని మరో ఆటోలో వెళుతున్నారేమని ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇరువురూ ఘర్షణ పడ్డారు. ఆటో డ్రైవర్ లక్ష్మయ్యను కులంపేరుతో దూషించారు. మళ్లీ గ్రామంలో ఇదే విషయమై ఘర్షణ పడ్డారు. దీంతో వారు లక్ష్మయ్యపై దాడి చేయడంతో గాయపడ్డాడు. దీంతో అతడిని తిరుపతి రుయా వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు స్విమ్స్ వైద్యశాలకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. తొలుత అట్రాసిటీ కేసుగా నమోదు చేసిన పోలీసులు హత్యకేసుగా మంగళవారం నమోదు చేశారు. పుత్తూరు డీఎస్పీ జీ.రవికుమార్ కేసు దర్యాప్తు చేయనున్నట్లు సమాచారం.


లక్ష్మయ్య(ఫైల్)

క్యాన్సర్‌పై అవగాహన అవసరం


బుచ్చినాయుడుకండ్రిగలో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసులురెడ్డి


రేణిగుంట: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


సత్యవేడు: మాట్లాడుతున్న డాక్టర్ గుణశేఖర్

బుచ్చినాయుడుకండ్రిగ: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా కుష్టు, క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుచ్చినాయుడుకండ్రిగలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి గ్రామంలోని పురవీధుల్లో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏడు రకాల క్యాన్సర్లతో ప్రజలు ఎక్కువగా బాధ పడుతున్నారని, వాటిలో ఊపిరితిత్తులు, రొమ్ము, నోరు, గర్భాశయ, కడుపు, అన్నవాహిక, కాలేయ క్యాన్సర్లు ఉన్నాయన్నారు. కొన్ని జాగ్రత్తలతో ఈ క్యాన్సర్లకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. క్యాన్సర్‌ను ప్రథమ దశలో గుర్తించి సరైన చికిత్స, మందులు వాడితే పూర్తి స్థాయిలో నివారించవచ్చన్నారు. క్యాన్సర్ నుంచి కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ హైపటైటిస్ బి వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. వ్యక్తి శుభ్రత పాటించడం, ధూమపానం, మద్యపానానికి దూ రంగా ఉండాలన్నారు. ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవడమే గాకుండా శారీరక వ్యాయామాలు చేయాలని సూచించారు. అనంతరం ఆయన కుష్టు వ్యాధి అనుమానిత కేసులను పరిశీలించి, ఏఎన్ఎం, ఎమ్ఎల్‌హెచ్‌పీలకు కుష్టు, క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు దివాకర్, విద్యాసాగర్, సీహెచ్ఓ వేంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేణిగుంటలో ర్యాలీ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట క్యాన్సర్ పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. అంతకు ముందు పీహెచ్‌సీలో ఆశా వర్కర్లతో జరిగిన సమావేశంలో జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ ఓ డాక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ తేజస్విని, సీహెచ్ఓ హైమావతి, ఎంపీహెచ్ఈఓలు వెంకట్రమణ రాజు, నాగరాజు,హెల్త్ సూపర్ వైజర్లు కామరాజు, శివశంకర్, అనురాధ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం

సత్యవేడు: స్క్రీనింగ్ చేయించుకోవడంతో క్యాన్సర్‌ను గుర్తించి, అరికట్టవచ్చని దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్ అన్నారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ నాగజ్యోతి, స్టాఫ్‌నర్సులు పార్వతి, వనిత, టెక్నీషియన్ మురళి, ఏఎన్ఎంలు రోస్‌లిన్, మేరి, యమున, సరస్వతి, సుమలత, లతాదేవి, స్వాతి, లావణ్య, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడులో ర్యాలీ



శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలో పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ లహరి ఆధ్వర్యంలో జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు లహరి, సాయిపూజ పాల్గొన్నారు.

సప్తవాహన విహారి.. ఆనందలహారి


నారాయణవనంలో సూర్య,చంద్ర ప్రభ,పెద్ద శేషవాహనాల్లో కల్యాణ వేంకటేశ్వరస్వామివారు


శ్రీకాళహస్తి: విశేషాలంకరణలో సూర్యభగవానుడు, ఆలయంలో భక్తుల రద్దీ

- వైభవంగా రథసప్తమి

నారాయణవనం: సూర్యజయంతి సందర్భంగా పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి మంగళవారం ఏడు వాహనాలపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. దర్శించుకున్న భక్తులు ఆధ్యాత్మిక ఆనందం పొందారు. నారాయణవనంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు సూర్య,చంద్ర ప్రభ, పెద్ద, చిన్న శేష వాహనాలు, పల్లకి, తిరుచ్చి, కల్పవృక్ష వాహనాలపై ఊరేగారు. అర్చకులు ఉత్సవమూర్తులకు, స్నపనతిరుమంజనం చేశారు. అనంతరం చక్రస్నానం నిర్వహించారు. స్థానిక ఆలయాల ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆల యాధికారి నాగరాజు, భరత్, కోదండరామ శెట్టి పాల్గొన్నారు.

సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని జలవినాయకస్వామి వద్ద ఉన్న సూర్యభగవానుని ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీకాళహస్తీశ్వరస్వామికి..

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి మంగళవారం రథసప్తమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు.

రేణిగుంటలో..

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలంలోని దేవాలయాల్లో రథసప్తమి వేడుకలు మంగళవారం వేడుకగా జరిగాయి. ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా మలయప్ప స్వామి భక్తులను కటాక్షించారు.

వికృతమాలలో..

రేణిగుంట: ఏర్పేడు మండలం వికృతమాలలోని శ్రీసంతాన సంపద వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి స్వామివారి ఉత్సవ మూర్తిని సూర్యప్రభ వాహనంలో ఆలయ ధర్మకర్త పసుపులేటి హరిప్రసాద్, గ్రామ పెద్దలు ఊరేగించారు.

గుడిమల్లం పరశురామేశ్వరాలయంలో..

మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరాలయ ప్రాంగణంలో ఉన్న ఛాయా ఉష సమేత సూర్యనారాయణ స్వామికి అభిషేక పూజలు చేసి శోభాయమానంగా పుష్పాలంకరణ చేశారు. ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు.


వికృతమాలలో సూర్యప్రభపై సంతాన, సంపద వెంకన్న

అసంపూర్తిగా కాంబాకం రోడ్డు



వరదయ్యపాళెం: మండలంలోని వరదయ్యపాళెం నుంచి కాంబాకం గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణం అటవీశాఖ అతిథి గృహం మలుపు నుంచి 500 మీటర్ల దూరం అసంపూర్తిగా ఆగిపోయింది. గతంలో ఈ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే అటవీశాఖ అధికారుల అభ్యంతరం మేరకు రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. అనంతరం అటవీశాఖ నుంచి అనుమతులు వచ్చే సమయానికి నిర్మాణ వ్యయం, వస్తు సామగ్రి ధరలు పెరగడంతో మంజూరైన నిధులు పూర్తిస్థాయి రోడ్డు నిర్మాణానికి సరిపోలేదు. దీంతో 500 మీటర్ల మేరకు రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం కంకర తేలిన ఆ రోడ్డుపై స్థానికులు రాకపోకలకు సాగించడానికి ఇబ్బందిపడుతున్నారు.